# మైదానం

కిటికీ అద్దం భళ్ళున పగిలింది. క్రికెట్ బంతి వచ్చి బంకత్‌లాల్ పొట్టమీద పడింది.

మాగన్నుగా నిద్రపోతున్న బంకత్‌లాల్ ఉలిక్కిపడి లేచాడు. పొట్టమీద పడిన బంతి చేతిలోకి తీసుకుని, ఉగ్రరూపంతో కిటికీ తలుపులు తెరిచి బయటకు చూశాడు. మేడమీంచి వీధి బాగానే కనిపిస్తుంది. చేతిలో బ్యాటు పుచ్చుకొని నిలబడింది మరెవరో కాదు. స్వయానా మనవడు ముఖేష్! మిగతా కుర్రాళ్ళు 'హుష్‌కాకి' లా మాయమయ్యారు.

'వీధిలో క్రికెట్ ఏమిటి? నువ్వు మేడమీదికి రా ముఖేష్' పెద్దగా అరిచాడు బంకత్‌లాల్.

'ఊహూం... నేను రాను. బంతి ఇటు విసురు...' గారాబంవల్ల కలిగిన ధైర్యం అది.

'నేను కిందికి వస్తున్నా ఉండు' అంటూ గబగబ మెట్లు దిగి కిందికి వెళ్లేసరికి వీధిలో ఎవరూ లేరు. బంకత్‌లాల్ అసహనంగా అటుఇటు వెతికాడు. చివరికి కోడలితో ఫిర్యాదు చేద్దామని వెళ్ళేసరికి అక్కడ చీరకొంగు చాటున దాక్కుని తొంగి తొంగి చూస్తున్నాడు ముఖేష్! పన్నెండేళ్ళొచ్చినా వీడికి కుదురు లేదనుకుంటా.

"అమ్మాయ్. వీడి అల్లరి బాగా ఎక్కువైంది. బజార్లో కుర్రాళ్ళతో వేళాపాళా లేకుండా క్రికెట్ ఆడుతున్నాడు. మేడపైన కిటికీ అద్దం కూడా పగలకొట్టాడు."

"నేను కోప్పడతాలెండి మామయ్యగారూ! మీరు విశ్రాంతి తీసుకోండి' అంది వినయంగా కోడలు పూజ.

"ఇంకెక్కడి విశ్రాంతి! వీడి దెబ్బకి నిద్రకాస్తా పారిపోయింది" అంటూ మేడపైకి వెళ్లాడు.

మంచం మీద నడుం వాల్చాడన్న మాటేగానీ, పోయిన నిద్ర పోయినట్లే ఉండిపోయింది. ఆలోచనలు కందిరీగల్లా ముసురుకున్నాయి.

ఉదయం శేషగిరి మాస్టారితో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది.

'బంకత్‌లాల్‌గారూ! ఇన్నాళ్ళూ ఈ స్కూలే నా జీవితాశయంగా రాత్రింబగళ్లు దీని సేవలో బతికాను. నా తరవాత దీని బాధ్యత తీసుకోవాల్సిన ఒక్కగానొక్క కొడుకు నా కళ్లముందే కాన్సర్‌తో చనిపోయాడు. ఇప్పుడు నేను ఏకాకిని. నాకెవరూ లేరు. ఈ స్కూలుని అమ్మి చివరి రోజులు కాశీలో గడపాలనుకుంటున్నాను. దీన్ని న్యాయమైన ధరకి మీరే కొనుక్కోండి" అన్నాడు చేతులు జోడించి.

'మాస్టారూ! ఎప్పుడో మీ పెద్దలకాలం నాటి స్కూలు ఇది. ఎంతలేదన్నా అర ఎకరం వైశాల్యం ఉంటుంది. దీన్ని కొనగల స్థోమత నాకు లేదు" అని తప్పించుకోజూశాడు.

"లేదు. అలాగనకండి. నేను అమ్మితే మీకు తప్ప ఎవరికీ అమ్మను. మీరెంత ఇస్తే అంతే తీసుకుంటాను. డబ్బు కూడా మీరు ఒక్కసారే ఇవ్వక్కర్లేదు. మీరు ఇవ్వగలిగినంత ముందు ఇవ్వండి...మిగతాది నేను కాశీలో ఉండే చిరునామాకి పంపండి"

"మాస్టరుగారూ! ఎందుకిలా నష్టపోదామనుకుంటున్నారు? వేరేవాళ్లకి అమ్మితే చాలా లాభం వస్తుంది. నేను బేరం చూస్తాను"

"బంకత్‌లాల్‌గారూ! మీ నాన్నగారూ మా నాన్నగారూ మంచి మిత్రులు. కష్ట సమయాల్లో మా కుటుంబాన్ని మీ నాన్నగారు ఆర్థికంగా ఆదుకుని నిలబెట్టారు. అలా చేయకపోయి ఉంటే ఎప్పుడో ఈ స్థలాన్ని అమ్ముకోవాల్సి వచ్చేది. మీరు మాత్రం మాకు సాయం చెయ్యటం లేదా? ఇవన్నీ మరిచిపోయి, కేవలం లాభం కోసం వేరేవాళ్లకి అమ్ముకోనా?! అంతేకాదు మీరైతే దీన్ని సద్వినియోగం చేస్తారు. ఆ నమ్మకం నాకుంది'

"సరే ఆలోచించి రేపు ఏ సంగతీ చెబుతాను" అని అప్పటికి విషయాన్ని వాయిదా వేశాడు. ఈ సంభాషణ గురించి ఎలా తెలిసిందో... మార్వాడీ మిత్రులు వచ్చేశారు. వాళ్లంతా కట్టుబట్టలతో వచ్చి కళ్లముందే లక్షలు గడించారు.

"అన్నగారూ! మీరు శేషగిరి గారి స్కూలు కొంటున్నారట. అందులో మాకు మూడొందల గజాల ప్లాటు ఉంచండి. ఇదుగో అడ్వాన్సు' అంటూ ఇవ్వబోయిన వాళ్లందరికీ నేను ఇంతవరకు ఆ స్కూలు కొనాలని నిర్ణయించుకోలేదు. ఒకవేళ కొంటే అందులోంచి గజం కూడా ఎవరికీ అమ్మను" అన్నాడు.

"ఎందుకని?"

"దాంతో వ్యాపారం చెయ్యదలచుకోలేదు. ఆ స్థలాన్ని మంచికి వినియోగించాలని శేషగిరి మాస్టారి కోరిక"

"ఇప్పటికే చాలా కాన్వెంటులొచ్చేశాయి. ఆ స్కూలు నువ్వు నడపాలనుకున్నా ఎవరూ రారు" వ్యంగ్యంగా అన్నారు.

"స్కూలు నడపాలని నాకు లేదు"

"ఇంకా మంచి పని ఏం చేస్తావ్... గుడి కడతావా, ఆస్పత్రి కడతావా లేక సత్రం కడతావా?" ఒకరి తర్వాత ఒకరు ప్రశ్నలు సంధించారు.

"ఆ మూడిట్లో ఏదో ఒకటి కట్టొచ్చుకదా?" ఎదురు ప్రశ్నించాడు.

"సరే అది నీ ఇష్టం. ఒకవేళ నువ్వు కొనకపోతే, మాకు బేరం కుదిర్చిపెట్టు... నీ లాభం నీకు ఇస్తాం."

"అలాంటి బ్రోకరు పనులు నేను చేయను"

22ఇందులో తప్పేముంది భాయీ? అది కూడా వ్యాపారమేగా?"

"దయచేసి ఈ సంభాషణ ఇక్కడితో ఆపెయ్యండి' అంటూ చేతులు జోడించాక, ఈసడింపుగా అందరూ నిష్క్రమించారు. బంకత్‌లాల్ మంచం మీద లేచి కూర్చున్నాడు. చొక్కా వేసుకుని శేషగిరి స్కూలు కేసి వెళ్ళాడు. స్కూలు పేరు 'శారదా పాఠశాల' అక్షరాలు కూడా బాగా వెలిసిపోయాయి. పెంకుటి కప్పు ఎప్పుడు కూలదామా అని ఎదురు చూస్తోంది. ఖాళీ స్థలం చాలా ఉంది. కానీ, అంతా పిచ్చిమొక్కలు పచ్చగడ్డితో నిండిపోయింది. బంకత్‌లాల్ స్కూల్ ఆవరణ అంతా తిరిగాడు. స్థలం మధ్యలో నిలబడి ఆలోచించాడు. శేషగిరి మాస్టారి మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి.

"మీరు ఇవ్వగలిగినంత ఇవ్వండి. మిగతాది కాశీ చిరునామాకి పంపండి" ఆయన మొహంలోని కృతజ్ఞత, విశ్వాసం, దీనత్వం కదిలించాయి.

"కొనక తప్పదు" అనుకుంటూ ఇంటివైపు నడిచాడు బంకత్‌లాల్.

"గుడి కడతావా, సత్రం కడతావా, ఆస్పత్రి కడతావా- ఏం కడతావ్?" ఈ ప్రశ్నలు బంకత్‌లాల్ మనసులో మళ్లీ మళ్లీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

ముందు శేషగిరిరావు మాస్టారికి ఇవ్వగలిగినంత ఇచ్చి, స్థలం రిజిస్టరు చేయించుకున్నాడు. బుల్‌డోజర్లతో స్థలాన్ని తీరుగా చదును చేయించాడు. పాత బిల్డింగ్‌ని పడగొట్టించి, అందులో పనికొచ్చే వస్తువుల్ని బీదవారికి ఉచితంగా ఇచ్చాడు.

ఇప్పుడు ఆ స్థలం విశాలంగా చూట్టానికి మైదానంలా ఉంది.

మార్వాడీ మిత్రులు మళ్లీ మళ్లీ అడుగుతూ, వెంటబడుతూనే ఉన్నారు. అందర్నూ పూనుకొని అక్కడ ఒక పెద్ద 'కమర్షియల్ కాంప్లెక్స్' కడితే అద్భుతంగా ఉంటుందని, అందుకు సంబంధించిన ఒక నమూనా ప్లాను కూడా తీసుకొచ్చి చూపించారు. బంకత్‌లాల్ అన్నీ వింటున్నాడు. తన నిర్ణయాన్ని మాత్రం బయటకు చెప్పడంలేదు. లోలోపల ఆలోచించుకున్నాడు.

'కమర్షియల్ కాంప్లెక్స్' అయితే, పదిరెట్ల ధర వస్తుంది. శేషగిరి మాస్టారికి భారీగా ముట్టజెప్పవచ్చు. కానీ ఆయన ముందుగానే దీన్ని సద్వినియోగపరచాలనే సంకల్పాన్ని వెల్లడించాడు. అంటే కమర్షియల్‌గా ఉండకూడదని.

ఆశయం బాగానే ఉంది. కానీ దాన్ని ఏ రూపంగా ఆచరణలో పెట్టాలో తేల్చుకోలేకపోతున్నాడు బంకత్‌లాల్. పడక్కుర్చీలో వెనక్కివాలి ఆలోచనలతో సతమతమవుతుండగా మాగన్నుగా నిద్రపట్టింది.

అంతలో పెద్దగా అరుపులు... కేకలు....ఏడుపులు....

బంకత్‌లాల్ ఎవరో చరిచినట్లు లేచాడు. మేడకింద గలభా వినిపించి ఆదరాబాదరా పరుగెత్తాడు. మేడ దిగుతూనే పెద్దగా అరుస్తూ 'ఏమైంది...ఏమైంది' అంటూ అటు వెళ్ళాడు.

కోడలు పెద్దగా ఏడుస్తోంది.

ఒళ్లో ముఖేష్ పడుకుని ఉన్నాడు. కుడి కంటినిండా నెత్తురు.

బంకత్‌లాల్ పై ప్రాణాలు పైనే పోయినట్లనిపించింది.

"ముఖేష్‌కి ఏమైంది" అన్నాడు దగ్గరకు వెళ్ళి వణుకుతున్న చేతుల్తో తడుముతూ.

"క్రికెట్ బంతి తగిలింది"

తల పట్టుకు కూలబడిపోయాడు.

"వీధిలో క్రికెట్టు ఆడొద్దని రోజూ మొత్తుకుంటూనే ఉన్నా. చెబితే ఎందుకు వింటారు. ముందు అర్జంటుగా కంటి డాక్టరు దగ్గరికి వెళదాం పదండి" అంటూ ముఖేష్‌ని చేతుల్లోకి తీసుకున్నాడు.

000

"కన్ను పూర్తిగా దెబ్బతింది. శాశ్వతంగా కుడికన్ను లేనట్లే."

డాక్టరు మాటలు గుండెని తొలచేశాయి.

జీవచ్ఛవంలా నడుస్తూ వార్డులో ఉన్న మనవడి దగ్గరికి వెళ్ళాడు బంకత్‌లాల్. కుడికన్ను మీద బ్యాండేజి. ఎడం కన్నుతో తాతగారిని చూస్తూ మందహాసం చేశాడు ముఖేష్.

"వీడెలా నవ్వగలుగుతున్నాడు!" మనవణ్ని వింతగా చూశాడు బంకత్‌లాల్. బాధ కలిగించే వాళ్లకి బాధ ఉండదా?

జీవితకాలం ఒక కన్నుతో ఎలా బతుకుతాడు. ఎలా చదువుకోగలుగుతాడు. ఎవరు పిల్లనిస్తారు. భగవంతుడా! ఇంత చిన్న వయసులో ఏమిటి వీడికీ శిక్ష?

రోజూ వీడి మొహాన్ని చూస్తూ దుఃఖాన్ని ఎలా తట్టుకోవటం. తన వంశానికి వీడే వారసుడు. ఈ అవిటితనం వీడికే రావాలా!

'ఎందుకు తాతా ఏడుస్తావ్? ఇప్పుడు నాకేమైంది?' తాతగారి కన్నీళ్లు తన చిన్న చేతులతో తుడుస్తూ అడిగాడు ముఖేష్.

"ఇంతకంటే ఇంకేం కావాలి? ఎన్ని మాట్లు మొత్తుకున్నా ఆ బజారు ఆటలు మానావు

కాదు. నిన్నిలా చూట్టానికే నేను బతికున్నానా?” తల పట్టుకున్నాడు.

‘బజార్లో కాకపోతే ఇంకెక్కడ ఆడుకోవాలి తాతా! ఏ స్కూలుకీ ఆట స్థలం ఉండదు. పార్కుల నిండా మొక్కలు. ఆడుకోవటానికి వీలు కాదు. మా పిల్లల గురించి ఎవరు ఆలోచిస్తున్నారు తాతా? పెద్ద వాళ్లందరూ వ్యాపారాలు, డబ్బులు సంపాయించటం... పిల్లలు ఎక్కడికీ పోకూడదు. బజార్లో ఆడుకోకూడదు. ఇంట్లోనే మూల కూర్చోమంటే మాకేం తోస్తుంది? మీ కిష్టమైనవన్నీ మీరు చేస్తూ మమ్మల్ని మాత్రం మాట్లాడకుండా కూర్చోమంటే నువ్వే న్యాయం చెప్పు తాతా... నీ చిన్నప్పుడు ఆటలాడలేదా, ఇంట్లోనే కూచున్నావా?’

బంకత్‌లాల్ కళ్లు పెద్దవి చేసి ఆశ్చర్యంతో విన్నాడు. ఒక్కోప్రశ్నా ఒకో కరకు బాణంలా గుచ్చుకుంది. నిజమే! పిల్లలు ఆడుకునే హక్కు హరించుకుపోయింది. ఇప్పుడు వీధులే ఆట స్థలాలుగా మారిపోయాయి. వచ్చే పోయే వాహనాల వల్ల ప్రమాదం జరగొచ్చనే స్పృహ లేకుండా బాల్యం వీధుల్లో పడి తమ హక్కుల్ని ఉపయోగించుకుంటూ స్వార్థ ప్రపంచాన్ని ధిక్కరిస్తోంది. అడపా దడపా పసివాళ్లు ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. కానీ, అవేమీ వాళ్ల ఆటల్ని ఆపలేకపోతున్నాయి.

“తాతా! నీక్కూడా నాలాగే పన్నెండేళ్లుంటే మా పిల్లల బాధ అర్థమయ్యేది. మాకు తిండి లేకపోయినా ఫర్వాలేదు. ఆటల్లేకుండా మాత్రం ఉండలేం”

ఆ మాటలు బంకత్‌లాల్‌కి కోపం తెప్పించాయి.

“ఇలా కళ్లూ కాళ్లూ పోయే ఆటలాడాలా? ఇంకేం చెప్పకు. నేను వినను” అన్నాడు.

“ఒకే ఒక్కమాట విను తాతా! శేషగిరి మాస్టారి స్థలం ఇప్పుడు మనదేగా? నువ్వు బాగు చేయించాక ఆటల మైదానంలా తయారయింది. దాన్ని మా పిల్లల కొదిలేస్తే ఇంకెప్పుడూ వీధుల్లో ఆడం. నాలాగా ఎవరి కళ్ళూ పోవు. సరేనను తాతా” గడ్డం పుచ్చుకొని బతిమిలాడాడు ముఖేష్.

బంకత్‌లాల్ ఆలోచనలో పడిపోయాడు. మళ్లీ మళ్లీ అదే విషయం అడుగుతుంటే, కట్టుకట్టిన మనవడి కుడి కన్ను చూస్తూ. తట్టుకోలేక జలజల రాలుతున్న కన్నీళ్ల మధ్య “సరే బాబూ” అంటూ ముఖేష్‌ని గుండెలకి హత్తుకున్నాడు.

ముఖేష్ సంతోషంగా కన్ను మూసుకున్నాడు.

వాడి మనసు అప్పుడే మైదానం వైపు పరుగులు తీసింది. స్నేహితులతో గంతులు పెడుతూ ఆడుకుంటోంది.

ఎటు చూసినా ఆనందమే ఆనందం.

(చినుకు మాసపత్రిక ప్రత్యేక సంచిక)